క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



నగదును అందజేస్తున్న శ్రీనాథ్

గన్నేరువరం: మండలంలోని హన్మాజిపల్లె గ్రామానికి చెందిన పెద్దపల్లి రాజు ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులను యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. అనంతరం రూ.ఐదువేల నగదు అందజేశారు. అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, మల్లేశం, చంద్రారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు పారునంది సంజీవ్, గూడ రవీందర్‌రెడ్డి, నాగయ్య, రజాక్, అమ్మిగల్ల అజయ్, పర్శరాములు, దేవ శ్రీశైలం, నారాయణరెడ్డి, హన్మాసుల ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

బీమా చెక్కు...

సైదాపూర్: సైదాపూర్ పురుషుల పొదుపు సంఘం సభ్యుడు రాయిశెట్టి భిక్షపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య కమలకు రూ.72 వేల చెక్కును సంఘం అధ్యక్షుడు పైడిపల్లి రవీందర్ అందజేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు పైడిపల్లి రమేశ్, సభ్యులు కోడెం సురేష్, ఎండీ రఫీ, మారుతి, పర్శరాములు, శ్రీనివాస్, కార్తిక్, కిషోర్, రమేశ్, గణకుడు వీరన్న ఉన్నారు.

పరామర్శ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్ద పాపయ్యపల్లి గ్రామానికి చెందిన సంఘం (పెద్ద)ఐలయ్య మంగళవారం వృద్ధాప్య సమస్యలతో మృతిచెందగా రాష్ట్ర పద్మశాలీ సంఘం నాయకుడు, జిల్లా సమన్వయకర్త ఆడిచర్ల శ్రీనివాస్ మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడి కుమారులు భాస్కర్, శ్రీధర్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంట పద్మశాలీ సంఘం జిల్లా నాయకులు సంఘం సత్యనారాయణ చిలుకమారి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంఘం ఐలయ్య, గ్రామ, పట్టణ నాయకులు ఉన్నారు.

గన్నేరువరంలో..



గన్నేరువరం: మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన రంగనవేణి పోశయ్య ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం పరామర్శించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, నల్ల చంద్రారెడ్డి, కూన కొమురయ్య, యాదగిరి పాకాల పర్శరాం, వెదిరె అజయ్, బుర్ర తిరుపతి, గీకురు పర్శరాం, చంద్రయ్య, ఐలయ్య కలిసి రూ.తొమ్మిది వేల విలువైన బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్, అజయ్, వీరయ్య, ప్రశాంత్, తిరుపతి, లచ్చయ్య, వెంకటయ్య, మల్లయ్య, ఐలయ్య, రాజు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి రైతు ససేమిరా

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరిలో 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు' అనే సాక్షి కథనానికి ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించారు. మంగళవారం ఉదయం జూనియర్ లైన్‌మెన్ కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను పరిశీలించారు. విషయాన్ని ట్రాన్స్‌కో ఏడీఈ. నుస్తులాపూర్ డివిజన్ (ఆపరేషన్ విభాగం)కేసీ ప్రశాంతకు వివరించారు. ఇందుర్తి సెక్టార్ ట్రాన్స్‌కో ఏఈ రాజుతో కలిసి ఆమె వేలాడుతున్న బంచ్‌వైర్లను పరిశీలించారు. సంబంధిత రైతు నాగరాజుతో మాట్లాడారు. బంచ్‌వైర్లకు మధ్యలో పోల్ వేసి సవరిస్తామని చెప్పారు. దీనికి సదరు రైతు ఈలైన్ వద్దు, ఇక్కడి నుంచి వేరేచోటకు షిఫ్ట్ చేయాలని కోరాడు. షిఫ్టింగ్ కోసం చార్జీల నిమిత్తం డీడీ తీస్తే మరోచోటుకు మారుస్తామన్నారు. డీడీ తీయను, మిడిల్‌పోల్ అవసరం లేదు, లైన్ మాత్రం ఇక్కడి నుంచి తొలగించాలని నాగరాజు ఏడీఈ తో చెప్పాడు. సమస్య రెండేళ్లుగా కొనసాగుతోందని, రైతు మొండిపట్టుతో ఉన్నాడని ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. ఈ విషయంలో తమశాఖ సిబ్బంది నిర్లక్ష్యం లేదన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్‌రూరల్: గాండ్ల, తేలి కుల వృత్తిదారులను ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తగిన చర్యలు చేపట్టాలని గాండ్ల కుల సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కం సంపత్, ప్రధాన కార్యదర్శి జక్కం పుల్లయ్య కోరారు. మంగళవారం సంఘం కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎద్దులను గానుగకు కట్టి స్వచ్ఛమైన నువ్వులు, పల్లినూనెను తీసి ప్రజలకు విక్రయించి జీవనోపాధి పొందినట్లు చెప్పారు. ప్రస్తుతం పెద్దపెద్ద ఆయిల్ మిల్లుల రాకతో కుటీర పరిశ్రమ దెబ్బతిని ఉపాధి కోల్పోయినట్లు తెలిపారు. దేవాలయాల్లో ధూపదీప నైవేద్యాలకు గానుగ నూనె వాడేవారని, నూనె సరఫరా చేసే టెండర్లను గాండ్ల కులస్తులకు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం కోశాధికారి గుజ్జేటి రవీందర్, జక్కం విద్యాసాగర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు ఆహ్వానం.. పేదల ఆనందం

- రేపటి నుంచి రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ
- సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు కీలకం



రంగాపూర్ రేషన్‌షాపులో బియ్యం తీసుకుంటున్న ప్రజలు (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్: ఒకటికాదు.. రెండుకాదు దాదాపు దశాబ్ద కాలంగా రేషన్ కార్డుల కోసం వేలాది మంది పేదలు ఎదురు చూస్తున్నారు. కనీసం వాటిలో తప్పిదాలు లేదా మార్పులు, చేర్పులకు కూడా ఇప్పటివరకు అవకాశం ఇవ్వకపోవడంతో పేదలు పడిన పాట్లు చెప్పలేనివి. తాజాగా ప్రభుత్వం కార్డుల మంజూరుకు ఈ నెల 28 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రకటించడంతో పేదల్లో ఆశలు చిగురించాయి. చెప్పలేని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

2018లో అప్పటి ప్రభుత్వం కార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. హుజూరాబాద్ మండలంలో అంత్యోదయ, ఆహార భద్రత కార్డులు కలిపి 20,553 ఉన్నాయి. హుజూరాబాద్ మండలంలో 670 మంది దరఖాస్తు చేసుకున్నారు. హుజూరాబాద్ బై ఎలక్షన్ సమయంలో అడపాదడపా కొత్త రేషన్ కార్డుల పంపిణీ జరగ్గా, రేషన్ కార్డుల మార్పులు, చేర్పులు జరగకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.

మళ్లీ సన్నద్ధమవుతున్నారు...

ఉమ్మడి కుటుంబంలోని అన్నదమ్ములు చాలా మంది విడిపోయి భార్యా పిల్లలతో వేరుగా ఉంటున్నారు. మరికొందరు తల్లిదండ్రుల నుంచి విడిపోయి వేరుగా జీవిస్తున్నారు. ఇలాంటి వారికి రేషన్ కార్డులు లేవు. కొన్ని కుటుంబాల్లో కొంతమంది పేర్లు రేషన్ కార్డుల్లో నమోదు కాలేదు. పాత దరఖాస్తుదారులు మళ్లీ కొత్తగా చేసుకోవాలా ? వద్దా అనే విషయంలో స్పష్టత లేదు. దీంతో ఇంతకు ముందు దరఖాస్తు చేసుకున్న వారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు.

రేషన్ కార్డే ఆధారం...

ప్రస్తుతం రేషన్‌కార్డుకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ప్రమాదం జరిగితే ఖరీదైన వైద్యం కోసం రెవెన్యూ అధికారులు రేషన్‌కార్డు ప్రామాణికంగా తీసుకొని తాత్కాలిక ఆరోగ్యశ్రీకార్డు మంజూరు చేస్తున్నారు. తాజాగా ఆ రోగ్యశ్రీ కింద వైద్య ఖర్చుల పరిమితి రూ.10 లక్షలకు పెంచడంతో రేషన్ కార్డు కీలకంగా మా రింది. అలాగే ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉపకార వేతనాలు పొందడానికి రేషన్ కార్డు ఆధారంగా చేసుకుని అధి కారులు కులం, ఆదాయం, ఇతర ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. అలాగే సంక్షేమ పథకాలకు సైతం కీలకంగా మారడంతో రేషన్ కార్డుల పంపిణీపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

సంతోషంగా ఉంది



గత ప్రభుత్వ హయాంలో రేషన్‌కార్డులో మార్పులు చేయాలని దరఖాస్తు చేసుకొని నెలలు గడిచినా ఇప్పటివరకు సరి చేయలేదు. మార్కెట్లో బియ్యం కొనుగోలు తలకు మించిన భారమైంది. మార్పు, చెర్పుల కోసం దరఖాస్తులు ఎప్పుడు తీసుకుంటారా అని ఎదురు చూశాం. ఇప్పుడు అవకాశం రావడం సంతోషంగా ఉంది.

– తాళ్లపల్లి అనూష, కాట్రపల్లి

ఎదురుచూస్తున్నాం



కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకొని నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు నూతన కార్డుల మంజూరుపై ఎలాంటి స్పష్టత లేదు. కానీ ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామసభల ద్వారా రేషన్ కార్డు దారులను ఎంపిక చేస్తామని చెప్పటం ఆనందంగా ఉంది. కొత్త రేషన్ కార్డు కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం.

– గద్దల స్నేహ, శాలపల్లి-ఇందిరానగర్

హుజూరాబాద్‌లో ప్రజాపాలన వార్డుసభల షెడ్యూల్

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రజాపాలన వార్డు సభల షెడ్యూల్‌ను మున్సిపల్ అధికారులు మంగళవారం ప్రకటించారు.

డిసెంబర్ 28న

ఒకటో వార్డు కొత్తపల్లి గ్రామం హనుమాన్ టెంపుల్ వద్ద
రెండో వార్డులోని మామిళ్లవాడ ఉర్దూ పవన్ వద్ద
మూడో వార్డులోని కుమ్మరివాడ చౌరస్తా వద్ద
నాలుగో వార్డులోని ప్రతాపవాడలో

డిసెంబర్ 29న

ఐదో వార్డులో పాతవాడ మూడు బజార్ల వద్ద
ఆరో వార్డులో మారుతినగర్ వెంకటరెడ్డి హౌస్
ఏడో వార్డులో బండంకుసువాడ రోడ్డు పాత రిజిస్ట్రేషన్ ఆఫీస్
ఎనిమిదో వార్డులో ఇప్పల్‌నర్సింగాపూర్ పాత జీపీ

డిసెంబర్ 30న

తొమ్మిదో వార్డులో దమ్మక్కపేట పాత జీపీ
పదో వార్డులోని ఇప్పలనర్సింగాపూర్ పాత జీపీ
11వ వార్డులో ఇప్పల నర్సింగాపూర్ పాత జీపీ
12వ వార్డు బీసీ కాలనీలోని దేవేందర్‌రెడ్డి ఇల్లు

జనవరి 2న

13 వార్డ్‌లోని పెట్రోల్ బంక్ పక్కన అంబేద్కర్ కమ్యూనిటీ హాల్
14వ వార్డులో బోర్నపల్లి పాత జీపీ
15వ వార్డులో ఎస్‌డబ్ల్యూ కాలనీ
16 వార్డులో పాత శంకర్ రైస్ మిల్లు

జనవరి 3న

17వ వార్డులో మామిళ్లవాడలోని ఉర్దూ భవన్, ప్రతాపవాడ పాత శివాలయం టెంపుల్
19వ వార్డులో పోచమ్మ వాడ ప్రైమరీ స్కూల్
20వ వార్డులో రాధాస్వామి సత్సంగ్

జనవరి 4న

21వ వార్డులోని పప్పు శ్రీనివాస్ ఇంటి సమీపంలో
22వ వార్డులో మాంటిస్సోరి స్కూల్ గ్రౌండ్
23వ వార్డులో గ్రీన్‌సెడ్జ్ స్కూల్
24వ వార్డులో బోర్నపల్లి పాత జీపీ

జనవరి 5న

25వ వార్డులో విద్యానగర్‌లోని పాత మాతృశ్రీ డిగ్రీ కాలేజ్ వద్ద
26వ వార్డులో ఓల్డ్ వెంకటేశ్వర థియేటర్ సూపర్ బజార్‌లో
27వ వార్డులో మార్కెట్ చౌరస్తాలో
28వ వార్డులో గుంటి మారుతి ఇంటి వద్ద

జనవరి 6న

29వ వార్డులోని గాంధీనగర్ ప్రైమరీ స్కూల్ వద్ద
30వ వార్డులో విద్యానగర్‌లోని కొత్త మాతృశ్రీ డిగ్రీ కాలేజీ వద్ద వార్డు సభలు నిర్వహిస్తారు. పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఇతర అధికారులు కోరారు.



రేకొండలో సీపీఐ ఆవిర్భావ వేడుకల్లో జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్, కార్యకర్తలు

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

గన్నేరువరం: మండల కేంద్రంలో సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం పార్టీ నాయకులు నిర్వహించారు. మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి పార్టీ జెండా ఆవిష్కరించారు. పేదలు, ప్రజా సమస్యలపై పోరాడేది సీపీఐ మాత్రమే నని, మండల అభివృద్ధికి నిరంతరం పోరాటం, ఉద్యమాలు చేస్తామన్నారు. మండల సహాయ కార్యదర్శి శ్రీశైలం, కోశాధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. రాచరిక వ్యవస్థ నిర్మూలన, భూమిలేని నిరుపేదలకు 10 లక్షల హెక్టార్ల భూపంపిణీలో సీపీఐ ఎనలేని కృషి చేసిందన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు, అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలను మరింత ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. బీఆర్ఎస్ నుంచి గోదారి లక్ష్మణ్ సీపీఐలో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నాయకులు, ఆటో, హమాలీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: దోపిడీ రహిత సమాజమే లక్ష్యంగా సీపీఐ పోరాటం చేస్తుందని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కోయ్యడ సృజన్‌కుమార్ అన్నారు. రామడుగు, దేశరాజ్‌పల్లి, గోపాల్‌రావుపేట, లక్ష్మీపూర్, రాంచంద్రాపూర్ గ్రామాల్లో సీపీఐ జెండాలను ఆవిష్కరించారు. మండల కార్యదర్శి గోడిశెల తిరుపతిగౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



శంకరపట్నంలో జెండా ఆవిష్కరిస్తున్న సమ్మయ్య

చిగురుమామిడి: మండలంలోని వివిధ గ్రామాల్లో సీపీఐ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. సీనియర్ నాయకులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. రేకొండలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఐ కాన్పూర్‌లో ఆవిర్భవించిందని, తెలంగాణ సాయుధ పోరాటంలో వందల మంది కామ్రేడ్‌లు అమరులయ్యారని పేర్కొన్నారు. సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి పటేల్, సింగిల్‌విండో డైరెక్టర్ చాడ శ్రీధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైదాపూర్: మండల కేంద్రంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు బాబు జెండావిష్కరించారు. బడుగు, బలహీన వర్గాల కోసం సీపీఐ నిరంతరం పోరాటం సాగిస్తుందన్నారు.



గన్నేరువరంలో వేడుకలు



రామడుగు: జెండా ఎగురవేస్తున్న సృజన్‌కుమార్

ఘనంగా శ్రీదత్త జయంతి



చొప్పదండి: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయంలో శ్రీదత్త జయంతి ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శేష వరప్రసాద్ వేద మంత్రోచ్చరణల మధ్య శ్రీదత్త పుణ్యక్షేత్రం గానుగాపూర్ నుంచి తీసుకువచ్చిన దత్త పాదుకలను ఆలయంలో ఊరేగించి దత్తాత్రేయస్వామి జయంతి వేడుకలు జరిపారు. ఆలయ ఆవరణలోని మేడి వృక్షంలు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్, స్థానిక కౌన్సిలర్లు బొద్దుల అరుణ, జూగురు సదానందం భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

చొప్పదండిలో..

చొప్పదండి: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో దత్త జయంతిని పురస్కరించుకొని దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్ర విజయవంతం చేయండి

చొప్పదండి పట్టణంలో బుధవారం అయోధ్య రామయ్య అక్షింతలు, ఆహ్వాన పత్రికల శోభాయాత్ర నిర్వహిస్తున్నామని భక్తులు హాజరై విజయవంతం చేయాలని అంతర్జాతీయ శ్రీకృష్ణ సమితి చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి దూస రాము కోరారు. ఉదయం భక్తాంజనేయ దేవాలయం, మార్కెట్ రోడ్ నుంచి పట్టణంలోని పుర వీధులు, దేవాలయాల గుండా శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటి నుంచి మంగళహారతులతో స్వాగతం పలకాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండలశాఖ అధ్యక్షుడు పడకంటి కృష్ణ, చేపూరి సత్యనారాయణ, పొన్నాల తిరుపతి, కటుకం మహేశ్, చంద్రయ్య, కిట్టుగౌడ్, సమరసింహారెడ్డి, సుధాకర్, ప్రశాంత్, శేఖర్, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం



చొప్పదండి: ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

జ్ఞాన సరస్వతి ఆలయ వార్షికోత్సవం

చొప్పదండి పట్టణంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన వార్షిక ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారి కళ్యాణ మహోత్సవం, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు జగన్నాథం విష్ణువర్ధనాచార్యులు, సింహాచలం జగన్మోహన్ స్వామి, భాష్యం నవ్య కుమార్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర

గన్నేరువరం: అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్రను మంగళవారం శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా ఖాసీంపేట గ్రామంలోని శ్రీ మానసాదేవి ఆలయం వరకు నిర్వహించారు. అనంతరం అయోధ్య శ్రీరామ జన్మభూమి మందిర ప్రాణప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా శ్రీరాముడి అక్షింతలు ఇంటింటికి చేరేలా గ్రామాలకు పంపించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శంకర్, మానసాదేవి ఆలయ కమిటీ చైర్మన్ చంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సునీల్, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, బుర్ర తిరుపతిగౌడ్, మల్లేశంగౌడ్, తాళ్లపల్లి పర్శరాములు, కట్టుపెల్లి అజయ్‌రెడ్డి, మురళీకృష్ణ, సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.



జమ్మికుంట: పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు



గన్నేరువరంలో శ్రీరాముడి అక్షింతల శోభాయాత్ర

క్రైం వార్తలు

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన తోట బసవయ్య పెంకుటిల్లు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాలు...బసవయ్య, భార్య లచ్చమ్మ మంగళవారం వ్యవసాయ పనులకు వెళ్లారు. షార్ట్ సర్క్యూట్‌తో టీవీ, ఇతర వస్తువులు కాలిపోయి ఇంటి పైకప్పుకు నిప్పు అంటుకోవడంతో దట్టమైన పొగలు వ్యాపించాయి. చుట్టుపక్కలవారు బసవయ్యకు సమాచారం అందించి మంటలు ఆర్పివేసే ప్రయత్నం చేయగా అప్పటికే ఇల్లు, ఇంటిలోని వస్తువులు కాలి బూడిదయ్యాయి. గ్యాస్ సిలిండర్‌కు నిప్పు అంటుకోకుండా అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. సుమారు రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలు

శంకరపట్నం: కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై వేగంతో వెళ్తున్న జీపు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల తెలిపిన వివరాలు... నెల్లూరు జిల్లాకు చెందిన బోడ మధు(24), భార్య శాంతి(20), కూతురు కిషికతో కలిసి ద్విచక్ర వాహనంపై సింగాపూర్ నుంచి శంకరపట్నం వస్తుండగా కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వెళ్తున్న జీపు గొల్లపల్లి శివారులో బైక్‌ను ఢీకొట్టింది. 108 వాహనంలో గాయపడిన వారిని హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కిషిక పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ తరలించారు.

జమ్మికుంట: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. వీణవంక మండలం కల్లుపల్లికి చెందిన రామంచ శ్రీనివాస్ జమ్మికుంట నుంచి కారులో స్వగ్రామానికి వెళ్తుండగా ఓదెల మండలం ఇందుర్తికి చెందిన రాచల అనిల్‌కుమార్, అఖిల జమ్మికుంటకు బైక్‌పై వస్తుండగా పట్టణంలోని కోరపల్లి రోడ్డు పెట్రోల్ బంక్ వద్ద కారు, బైక్ ఎదురుగా ఢీకొన్నాయి. బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు 108 వాహనంలో తీవ్ర గాయాలైనవారిని చికిత్స నిమిత్తం హుజూరాబాద్‌లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రిటైర్డ్ టీచర్ ఇంట్లో చోరీ

చొప్పదండి: పట్టణంలోని సాయినగర్‌లో విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపిన వివరాలు... పట్టణానికి చెందిన రిటైర్డ్ టీచర్ కామోజుల రాంకిషన్‌రావు ఇంటికి తాళం వేసి సోమవారం మధ్యాహ్నం కరీంనగర్‌కు వెళ్లాడు. మంగళవారం ఉదయం పని మనిషి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉండటంతో స్థానికుల ద్వారా సమాచారం అందించింది. గేటు తాళం వేసినట్లే ఉందని, ఇంటి తాళం పగలగొట్టి 80 గ్రాముల బంగారు నగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. రాంకిషన్‌రావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.



కేక్ కట్ చేస్తున్న కరీంనగర్ బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి

ఘనంగా వీర్‌బాల్ దివస్

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామ పరిధిలోని ప్రశాంత్ భవన్‌లో కరీంనగర్ బాలల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో మంగళవారం వీర్‌బాల్ దివస్ నిర్వహించారు. అనంతరం సమితి చైర్‌పర్సన్ శ్రీరామోజు ధనలక్ష్మి కేక్ కట్ చేసి మాట్లాడారు. దేశం, ధర్మం కోసం వీర పోరాటం చేసిన సాహస బాలల కథలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 26ను వీరబాలల దివస్‌గా ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు రేండ్ల కళింగశేఖర్, బొల్లం రాధ, బాలల పరిరక్షణాధికారి శాంత, ప్రశాంత్ భవన్ సూపరింటెండెంట్ సిరిల్, రమేశ్, ప్రియాంక, సరస్వతి, అనూష, మేరీరోసి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పిల్లలకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు.

నేడు దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ

కరీంనగర్: మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో బుధవారం ఉదయం 10 గంటలకు దివ్యాంగులకు ఉచితంగా సహాయ ఉపకరణాలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు.

ఫిలింభవన్‌లో సదస్సు..

జిల్లా కేంద్రంలోని ఫిలింభవన్‌లో నూతన ప్రజాసర్కార్–రాజ్యాంగబద్ధ పాలన–ప్రజల భాగస్వామ్యం–ప్రజా సంఘాల పాత్ర అనే అంశంపై బుధవారం ఉదయం 10 గంటలకు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమ సారథి పెద్దలు ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని పే ర్కొన్నారు. తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో విద్యార్థి, యువజన, కార్మిక, ఉద్యోగ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కోదండరాంకు సన్మాన కార్యక్రమముంటుందన్నారు.

ప్రజా సమస్యలు పట్టించుకోకపోవడం శోచనీయం

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు అనేక సమస్యలతో సతమతమౌతున్నా.. పాలక పక్షం, అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దుర్గం మారుతి, నాయకులు మిర్యాలకార్ ఆనంద్, తాడూరి బ్ర హ్మం, గుడిపాటి జితేందర్‌రెడ్డి, గంప జగన్, బాసం కుమార్, గోధారి చంద్రయ్య, ఆర్. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కరీంనగర్ ప్రెస్ భవన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెరమరుగైనా.. ఇప్పటికీ అధికారులు ఆ పార్టీకే కొమ్ము కాస్తూ ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్మార్ట్ సిటీ పనుల్లో రూ.130కోట్ల అవినీతి జరిగిందని బీఆర్ఎస్ నాయకుడే ఆరోపించడం గమనించాల్సిన విషయమన్నారు. ఈనెల 28న కార్పొరేషన్ ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.